
## జర్నలిస్టు కథలు



# డౌన్ డౌన్ విప్లవ కవిత్వం

అందరూ విప్లవ కవిత్వం రాస్తున్నారు గదా. మనవూ రాసేస్తే ఎలా వుంటుంది?" అన్నాడు ఎడిటర్ త్రయంబకం న్యూస్ఎడిటర్ సుబ్బారావు ఎదురుగా కుర్చీలో సుగాసీనుడైపోతూ.

సుబ్బారావు గుండె గుభేలు మంది— ఇప్పటికీ చిక్కి శల్యమైపోతున్న ప్రజాగోల సర్క్యులేషన్ త్రయంబకం విప్లవ కవిత్వం మొదలు పెడితే ఏమైపోతుందో ఊహించుకునేసరికి.

కాస్త అసింటా కుచున్న సర్క్యులేషన్ మేనేజర్ గతుక్కుమన్నాడు. కుర్చీ ఇసింటా లాక్కున్నాడు_ ఎలాగైనా విప్లవ కవిత్వం రాయద్దని త్రయంబకాన్ని వేడుకునే వుద్దేశంతో.

"విప్లవ కవిత్వం ఏం కష్టం కాదోయ్. మామూలు కవిత్వమే రాసి మధ్య మధ్యన మిత్రమా అనో, కామ్రేడ్ అనో, నేస్తం అనో తగిలిస్తే అది విప్లవ కవిత్వం అయిపోతుంది. ఉదాహరణకి రెండు చదువుతా శ్రద్ధగా విను..."

అప్పటికే హాల్లో వున్న మిగిలిన సబ్ ఎడిటర్లంతా అరచేతిలో గుండెలు పెట్టుకుని శక్తికొద్దీ పారిపోయారు. ఆ పని చెయ్యలేని సుబ్బారావూ, సర్క్యులేషన్ మేనేజరూ మాత్రం మిగిలిపోయారు.

ఆ తెరిచివున్న కిటికీలోంచి
లోకాన్ని చూడు నేస్తం
నా కళ్ళు అరువు తీసుకుని
చూడు నేస్తం లోకాన్ని
ఆ రోడ్డు పక్కన చెత్త కుండీల
చాటున విరిసీ విరియని
మొగ్గల్ని చూడు నేస్తం
అవలా మాడిపోతున్నాయేం నేస్తం"

ఇక నవ్వు ఆపు చేసుకోవడం సుబ్బారావు వల్ల కాలేదు. త్రయంబకం మరో పద్యం పాడితే తన ఆరోగ్యం పూర్తిగా పాడయ్యేట్టుంది.

వెంటనే గట్టిగా చప్పట్లు కొట్టేశాడు.

సర్క్యులేషన్ మేనేజర్ కూడా డిటో చేశాడు.

"చూశారా ఇదే విప్లవ కవిత్వం అంటే. ఇదే పద్యాన్ని 'నేస్తం' బదులు 'కామ్రేడ్' 'మిత్రమా' అనే పదాలతో కూడా రాయచ్చు. 'ప్రభూ' అంటే మళ్ళీ ఇదే పజ్యం క్లాసిక్ అయిపోతుంది" అన్నాడు త్రయంబకం.

ఇద్దరూ త్రయంబకం చెప్పింది అక్షరసత్యం అనేశారు.

"ఇంకో రెండు వినిపిస్తా" అన్నాడు త్రయంబకం మరో రెండు ఇడ్లీలు వడ్డిస్తా అన్నట్టు.

ఇద్దరూ కంగారు పడిపోయారు.

ఇంతలో ప్రజాగోల స్టార్ రిపోర్టర్ గుర్నాధం ప్రవేశించాడు ఆపద్బాంధవుడిలా. ఎవరైనా కష్టాల్లో వున్నప్పుడు ఆపద్బాంధవుడిలా ప్రవేశించడం అతని హాబీ.


"ఏవిటి ఎడిటర్గారు మంచి కవిత్వం వినిపిస్తున్నట్టున్నారు. నేను మిస్సైపోయాను" అన్నాడు గుర్నాధం కుర్చీలాక్కుని కూచుంటూ.

"ఒక్క నిముషం ముందు వొచ్చుంటే రెండు మంచి పజ్యాలు వినుండేవాడివి. పోన్లే మళ్ళీ చదువుతా" అన్నాడు త్రయంబకం గొంతు సవరించుకుంటూ.

"ఎడిటర్ గారు మన పేపర్లో విప్లవ కవిత్వం రాస్తానంటున్నారు" అన్నాడు సుబ్బారావు నీరసంగా.

గుర్నాధం ముంచుకోస్తున్న ముప్పుని పసిగట్టేశాడు.

"రాష్ట్రంలో పీపుల్స్‌వార్ గ్రూప్‌ని నిషేధించాక ఎవడైనా విప్లవ కవిత్వం రాశాడంటే లోపల తోసేయమని డీజీపీ ఆర్డర్ వేశాట్ట. విప్లవ కవిత్వం రాస్తే సర్క్యులేషన్ బ్రహ్మాండంగా పెరిగే మాట నిజమేగానీ పీపుల్స్‌వార్ని బాన్ చెయ్యక ముందే రాసెయ్యాల్సింది" అన్నాడు గుర్నాధం దిగులుగా.



"పోనీ 'నేస్తం' బదులు 'ప్రభూ' అని పెట్టేస్తే పోలీసులు తెలుసుకోలేరుగదా విప్లవ కవిత్వం అని" అన్నాడు త్రయంబకాన్ని పొగడ్డవే జీవితధ్యేయంగా పెట్టుకున్న సర్క్యులేషన్ మేనేజర్ ఆనందరావు.

సుబ్బారావుకి వాణ్ణి నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది.

కానీ ఆ ప్రమాదాన్ని త్రయంబకమే తప్పించాడు.

"నేస్తం అనే పదం తీసేస్తే ఇక అది విప్లవ కవిత్వం అవదు. క్లాసిక్ అయిపోతుంది. అలాంటి క్లాసిక్స్ లక్ష రాసేశాను ఇప్పటికి. ఏం చేస్తాం. ఇహ వెళ్ళి ఎడిటోరియల్ రాస్తా" అన్నాడు త్రయంబకం. రాష్ట్ర ప్రజల్ని బాధించడానికి ఇవాళ్టికి ఎడిటోరియల్ రాయడం తప్ప మరో మార్గం లేదన్న నిరాశ ఆయన గొంతులో ధ్వనించింది.

"హమ్మయ్య" అన్నాడు సుబ్బారావు పెద్ద ప్రమాదం తప్పి పోయినందుకు తేలిగ్గా నిట్టూరుస్తూ.

కానీ తప్పిపోతుందనుకున్న ప్రమాదం మరో రూపంలో ముంచుకొచ్చింది.

త్రయంబకం వెళ్ళిన మరుక్షణాన్న 'రాస్తా రాస్తా' అంటూ ప్రవేశించాడు జంబులింగం. ఇది హిందీ రాస్తా కాదు. తెలుగు రాస్తా.

ఈ జంబులింగం గాడు ఓ మంత్రిగారికి బావమరిది. వీడి బావ మంత్రి అవడం ద్వారా ప్రజల మీద కక్ష సాధిస్తుంటే వీడు నవలలు రాయడం ద్వారా జనాన్ని వేధిస్తున్నాడు. వీడు తాజాగా ఓ నవల రాసేసి దాన్ని ప్రజాగోల పత్రికలో సీరియల్‌గా వెయ్యమని మంత్రిగారి చేత రికమెండ్ చేయించాడు.

"మళ్ళీ వీడు దాపురించాడు దేవుడో. ప్రతి అడ్డమైన వాడికీ రాయడానికి ఈ పత్రికే దొరికిందా ప్రభూ" అన్నాడు సుబ్బారావు తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

గుర్నాధం కంగారు బడద్దనీ సకల కష్టాలనించీ కాపాడ్డానికి తను ఒహణ్ణి వున్నాననీ అభయం ఇచ్చాడు.

ఈలోగా జంబులింగం వొచ్చేసి ఫాను కింద సీటు చూసుకుని కూచుండిపోయాడు —పైగా 'హమ్మయ్య' అన్నాడు ఒక పెద్ద పని పూర్తయినట్టు.

"ఏం సార్ ఎప్పట్నించీ మొదలు పెడుతున్నారు మన సీరియల్" అన్నాడు జంబులింగం కాసేపు విశ్రాంతి తీసుకున్న తరవాత.

"మన సీరియల్ కాదు— నీ సీరియల్. అదిగూడా వెయ్యాలని ఇంకా అనుకోవడంలేదు" అన్నాడు సుబ్బారావు కసిగా.

ఈలోగా గుర్నాధం అందుకున్నాడు.

"కెన్ ఫోలెట్ మీ బంధువా?" అన్నాడు.

జంబులింగం సిగ్గుపడ్డాడు.

"మాకేం కాడు సార్" అన్నాడు.

"పోనీ ఆయన పోతూ పోతూ ఆస్తిపాస్తులన్నీ నీ పేర్న గానీ రాసి పోయాడా?"

"ఏం సార్ అలా అడుగుతున్నారు?" అన్నాడు జంబులింగం అనుమానంగా.

"కెన్ ఫోలెట్ 'ఐ ఆఫ్‌ది నీడిల్' అని నవల రాశాడు. కానీ దాన్ని తెలుగులో పేర్లు మార్చి రాసే హక్కు నాకు తెలిసినంత వరకూ ఎవరికీ ఇవ్వలేదు. ఒకవేళ నాకు తెలీకుండా నీగ్గానీ ఇచ్చేశాడా అని అనుమానం వొచ్చింది— అందుకూ" అన్నాడు గుర్నాధం.

"సార్ మీరు గూడా ఇంగ్లీషు నవలను

## జొన్నలగడ్డ రాధాకృష్ణ

చదువుతారా సార్" జంబులింగం ఆశ్చర్యంగా అడిగాడు.

"నేను కూడా ఏవిటి—నేనే చదివేది. నువ్వు పదోక్లాసు మూడుసార్లు తప్పావుగా నీకెలా అర్థం అయిందా ఇంగ్లీషు నవల అనేదే అంతుపట్టడం లేదు. ఎవరితో చదివించుకున్నావో చెప్పవూ?"

జంబులింగం మరింత సిగ్గుబడిపోయాడు.

"మా ఫామిలీ గ్రాడ్యుయేట్ సార్. అది చదివి చెప్పింది. తనే చెప్పింది సార్ తెలుగు పేపర్ల ఎడిటర్లకి ఇంగ్లీషు రాదని. పోన్లెండి మీకు ఇంకో నవలిస్తా—ఇది మరెవళ్ళకయినా ఇస్తా."

"చూడు జంబులింగం దీన్ని మరెవళ్ళకీ ఇవ్వొద్దు— మరోటేదీ మాకూ ఇవ్వొద్దు. తెలుగు పేపర్ల ఎడిటర్లకి ఇంగ్లీషు రాకపోవచ్చు గానీ సబెడిటర్లకి వొస్తుంది. అంచాత నువ్వు రచన చెయ్డం మానెయ్. అంతగా తెలుగు ప్రజల మీద నీక్కూడా ఏదైనా కోపం వుంటే రాజకీయాల్లో జేరిపో" అని సలహా ఇచ్చాడు గుర్నాధం.

"సారీ పోనీ హిందీనించి రాస్తాను సార్" అన్నాడు జంబులింగం దీనంగా.

"హిందీ కాదు పార్సీ భాష నించి కూడా రాయడానికి వీల్లేదు. తెలుగు పాఠకులు అంత తేరగా దొరికారా కలంతో కుళ్ళ బొడవడానికి. మళ్ళీ ఇటువైపు వొచ్చావంటే నువిప్పుడి దాకా రాసిన నవలల్ని ఏ ఇంగ్లీషు నవలనించి కాపీ కొట్టావో వ్యాసం రాస్తా" అన్నాడు గుర్నాధం.

అ దెబ్బకి లేచాడు జంబులింగం.

'రాస్తా రాస్తా' అనుకుంటూ నిష్క్రమించేశాడు.

అంతుకు ముందే అక్కడికి వొచ్చి జరిగిందంతా గమనించిన ఓ ఏజంటు "మీ (మా) పేపరుకి శనేదో పట్టుకున్నట్టుంది సార్" అన్నాడు జనాంతికంగా.

"శని కాదు పట్టుకున్నది— ఎడిటర్" అన్నాడు సుబ్బారావు తల పట్టుకుంటూ.

గుర్నాధానికి ఓ ఐడియా వచ్చింది.

" 'ఇకపై ప్రజాగోల సముజ్జ్వల దినపత్రికలో సీరియల్స్ గానీ విప్లవ కవిత్వాలు గానీ ప్రచురించబడవు. = సం.' అని ఇవాళ్టి పేపర్లో అచ్చుకొట్టెయ్— ఆ దెబ్బకి ఎడిటర్జీ భవిష్యత్తులో కూడా విప్లవ కవిత్వం రాయడానికి సాహసించడు" అన్నాడు.

సుబ్బారావుకి ఈ సలహా అమోఘంగా నచ్చింది.

"డౌన్ విత్ విప్లవ కవిత్వం" అన్నాడు పిడికిలి బిగించి.

"వెళ్ళబోయే ముందు నీకో సామెత చెప్పనా అన్నాడు గుర్నాధం.

"చెప్పు" అన్నాడు సుబ్బారావు వుత్సాహంగా.

"చిన్న కవినైనా పెద్ద కర్రతో కొట్టమన్నారు పెద్దలు." ●